# కోటలు గుడిసె మారింది

కె. కె. మీనన్

నగరం నడిబొడ్డు మీద, చీకట్లో, ఆ అందమైన భవంతి శ్రీ మహావిష్ణువు గుండెల మీద లక్ష్మీదేవి ముఖంలా వుంది.

ఛ! అదేం వుపమానం మరీ పాతది, అందులోనూ వూహకందని వుపమానం.

సరే, పోనీ, అమ్మాయి అందమైన జుట్టులో తెల్లని మల్లెపూవులా వుందని అందాం.

ఆ అందాల భవంతి ముందు

'ఆర్కిటెక్ట్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ లిమిటెడ్. ఇంజనీర్స్ అండ్ కాంట్రాక్టర్స్—'అని పెద్ద సైను బోర్డువుంది. ఆ కంపెనీ యజమాని సాంబమూర్తిగారికి ఆ భవనం మూడో అంతస్తులో అకస్మాత్‌గా మెలుకువ వచ్చింది.

సాంబమూర్తిగారికి మెలకువ వొచ్చింది కాబట్టి తెల్లవారిందని అర్థం కాదు, కాలం గతి తప్పి నడుస్తోందనీ కాదు. ఆ మాటకొస్తే ఆయన కాలాన్నే కట్టిపెట్టి నిలిపేయగల్డు (హెయిల్ అయిన్‌స్టీన్!) అంటే తెల్లవారినా కళ్ళు తెరపడన్నమాట!

సాంబమూర్తిగారు పగలంతా చాలా బిజీగా వుంటారు. పార్టీలతో వ్యాపార విషయాలు ముచ్చటించటం, బేంకు బేలన్సులు బేరీజు వేసుకుని ఏ కాంట్రాక్టులో ఏ అధికారికి ఎంత పెర్సెంటేజ్ సమర్పించుకుంటే ఎంత కాజెయ్యచ్చు—ఇలాంటి ప్రణాళికలతోటే ఆయన కాలం అంతా హరించి పోతుంది. అలా ఆర్జించిన సొమ్ము—తన్మూలంగా సంక్రమించిన హోదా, సంఘంలో పరువు, ప్రతిష్ఠ, ఉన్నత వర్గాలలో పలుకుబడీ—ఏటిని నిలుపుకోటానికీ మరింత పెంచుకోటానికీ, నాగరికుల విలాస కేంద్రం క్లబ్ కెళ్ళాలి—తప్పదు మరి"

సాంబమూర్తిగారు క్లబ్‌కు వెళ్తున్నారంటే ఆయన అనాయాసంగా ఆర్జించిన సొమ్మును ఎగరేసు కోటానికొ్కాదు. అలా ఎవరైనా అనుకుంటే వాళ్ళని టక్ మని పిచ్చాసుపత్రిలో జమకట్టవచ్చు. అసలు వారి కాంట్రాక్టుల్లో రొంభై శాతం అక్కడే సెటిలై పోతూవుంటాయని ఎంత మందికి తెల్సు?

సరే క్లబ్బుకి వెళతాడు

అక్కడి మాత్రం ఆయన పూరికే కూర్చుంటాడని అనుకుంటున్నారా! ఉహూ?' అక్కడా ఆయనకి బోలెడంత పని. చెయి ఖాళీ అయిపోయిన ఏ ఇంజనీరుగారికో, లేక ఓ పెద్ద అధికారికో కాస్త చెయి సాయం చెయ్యాలి, లేదా; నిన్న సమర్పించుకున్న దాంట్లో ఎంతో కొంత భాగం ఒడుపుగా రాబట్టుకోవాలి. అవసరం అయితే పోగొట్టుకుని (నష్టంమీద కాదు) అయినా సరే రేపు కావల్సిన పనికి నాందిగా

★ గుడిసెలకూ, మేడలకూ విలువల్లో ఎంతో తేడావుంది! మరి గుడిసెల్లో మనుషులకు, మేడల్లో మనుషులకూ మధ్య ఎంత తేడా ఉంటుంది? ★

ఇవాళే అవుననిపించుకుని బయటపడాలి. అలా బైటపడి ఇంటికి చేరుకునేప్పటికి ఎంత లేదనుకున్నా రాత్రి పన్నెండు దాటుతుంది. అప్పటికే ఒళ్ళంతా అలిసిపోయి మనసంతా విసిగిపోయి వుంటుంది. అలాంటప్పుడు క్లబ్‌లో పెద్దమనుషులు అలా బార్ వైపు చెయి చూపించి మొహమాటపెడితే సరేసరి, లేకపోతే ఇంటికొచ్చాకయినా ఓ పెగ్గు బిగించకపోతే ఆరోగ్యం చెడిపోదూ!

అలా ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకుని మెత్తని తల్పంమీద మేను వాల్చేటప్పటికి 'టైం'ఎంతో తెల్సుకోవల్సిన స్థితి దాటిపోతుంది. మళ్ళీ తెల్లారి పొద్దెక్కేవరకూ ఆయన్ని ఎవరూ, ఎందుకూ లేపరాదు. ఇది ఎమెర్జన్సీని మించిన క్రూరశాసనం.

కాని....కాని....అవాళ అఘాయిత్యం జరిగిపోయింది....

....వేకువ వెలుగు ధూళి రేపకముందే.... వెలుగు రేఖలు చీకట్ని రేప్ చెయ్యకముందే అప్రాచ్యు లెవరో ఆయన నిద్రని చెరిచేరు.

ఆయన నిద్రకి అలా నిలువునా మానభంగం జరిగేక ఆ రోజు ఆయనకు జరగబోయే నష్టం అంకెల వారీగా ప్రత్యక్షమై అలవోకగా ఆయన నిద్రకళ్ళముందు నిలబడి పెద్ద చికాకు కలిగించింది. విసుగ్గా లేచి, వెలుగును శాసించటానికి వేలుతో మీట నొక్కేరు. అది వెలిగి వారి అద్దాల కిటికీల్లోంచి బయటికూడా చేతులు చాచి వినయంగా ప్రకాశించింది.

ఆయన నిద్రా భంగానికి కారణాలు అర్థమైనాయి సాంబమూర్తిగారికి. అయినా కాని అసహనంగా కిటికీ తలుపులు తెరిచి కిందికి చూశారు, కింద పిగ్మీల్లా నేలబారు భారత పౌరులూ, వాళ్ళ నేపథ్యంలో గుజ్జెన గూళ్ళలా గుడిసెలూ కన్పించేయి. (ఇరవై సూత్రాల ప్రచారానికే ఇంత ముమ్మరంగా ఖర్చుపెట్టేరే ఇంకా ఆ గుడిసె లేవిటని ఆయనేం చింత పడలేదు. ఆ విషయంలో ఆయన సంతోషిస్తూనే వుంటాడు. ఆయనకి ఇరవై సూత్రాలూ కావాలి, గుడిసెలూ వుండాలి. ప్రభుత్వ కాంట్రాక్టులూ రావాలి, పన్జేయటానికి గుడిసెల మనుషులూ వుండాలి.)

అక్కడో గుడిసె ముందు అనేకమంది

## రచయిత గురించి



నన్ను రచయితగా చేసింది మా హెడ్మాస్టరు శ్రీ కందుకూరి రామభద్రరావుగారు. నాలుగో ఫారం చదువుతున్నప్పుడు నాచేత కథ రాయించి దాశరథీ శతకమూ, చిన్న బెడ్ లేంపూ బహుమతిగా ఇచ్చేరు. ఆ తర్వాత ఏదో చిల్లర మల్లర ప్రేమ కథలు రాసినా అసలైన కథా రచన పదేళ్ల మౌనం తర్వాత 1973 ఉగాదికే. ఆ సంవత్సరం నా కథకు మొదటి బహుమతి యిచ్చి మళ్ళీ నాచేత రాయించింది 'రంజని' సాహితీ సంస్థ. ఆ సంస్థకీ, అప్పటి అధ్యక్షులు శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తిగారికీ కృతజ్ఞతలు.

గర్వించదగ్గ కథలు ఇంతవరకూ ఏం రాయలేదు.

—కె. కె. మీనన్.

గుమిగూడి సజీవాంధ్ర భాషలో సంభాషణ సాగిస్తున్నారు. (వ్యవహారిక పదజాలం గురించి తలలు బద్దలు కొట్టుకునే పడక్కుర్చీ పండితులంతా ఓ క్షణం ఇక్కడ నిలబడితే అధికార భాషకి అవసరమైన టెర్మినాలజీ బోలెడంత దొరికిపోదూ!) ఆ భాషలోని పదాలూ వాటి తాలూకు క్రియలూ అంటే సాంబమూర్తి గారికి చాల ప్రీతి. అయినా వినటానికి అసహ్యించుకుంటున్న వాళ్ళా ముఖం పెట్టి—(ఎవరూ అప్పుడు ఆయన్ని చూసే అవకాశం, అవసరం లేకపోయినా)

—పీకలదాకా గుడుంబా పట్టించినా యీ వెధవలకి నిద్రపట్టి చావదేం—అనుకున్నారు.

—పీకలదాకా తాగినా వాళ్ళకి నిద్రపట్టదు.

—ఓ పెగ్గే అయినా తను ఒళ్ళుమరిచి నిద్రపోగలడు—

—రాత్రంతా నిద్రపోకపోయినా తెల్లవారేక వాళ్ళు గునపం పారా చేతపట్టుకుని పన్లోకెళ్ళిపోగల్రు—

—ఓ గంట (మామూలు టైం కంటె) ముందు లేస్తేనే తనకు ఆ రోజంతా బుర్ర పన్జేయనే చేయదు—

ఈ వెధవ మెరిట్స్, డి మెరిట్స్‌ఎవడికి కావాలి? ఆ రోజు తన పనంతా పాడై పోతున్నందుకే ఆయనకోపం.

కోపంవచ్చి, అక్కడ వాళ్ళనలా ఓ గౌరవనీయుడి ఇంటి ముందు వుండనిచ్చినందుకు ప్రభుత్వాన్నీ మున్సిపాలిటీనీ నోరారా తిట్టాలని పెదాలు విప్పేడు. కాని అందుకు బాధ్యత తనదేనని గుర్తుకువచ్చి ఆగిపోయేడు.

వాళ్ళు కూలీలు—

తన ఆర్జనకు నిత్యం అవసరం అయ్యే ఇంధనం వాళ్ళ శక్తిలో దొరుకుతుంది.

—మార్క్స్ అఖండుడివోయ్! లేబర్, సర్‌ప్లస్ వాల్యూ-ఎక్స్‌ప్లాయిటేషన్—ఓహ్.

—తత్ ఇవన్నీ పద్దెనిమిదో శతాబ్దపు పాత సిద్ధాంతాలు—

ఇప్పుడు సూత్రాలమీద సూత్రాలు—పదులూ, పాతికెలూ సూత్రాలు—అన్నిసూత్రాలూ వాళ్ళకోసమే—యస్. వాళ్ళ గురించేగా తను పడే యాతన. కూలి పుట్టిస్తున్నాడు. భృతి కల్పిస్తున్నాడు అవును. అందుకేగా అందుబాటులో వుండేందుకు ఉభయతారకంగా యింటి ముందు ఖాళీ స్థలంలో గుడిసెలు వేయించేడు.

—ఎదురుగా వుంటారు. ఎంత పొద్దున్నే అయినా లేపి, అదిలించి; పన్లోకి తోలెయ్యవచ్చు—

—దగ్గర్లో వుంటారు. అవసరం పడితే అర్ధరాత్రీ, అపరాత్రీ పిల్చి చిన్నా పెద్ద పనులు వూరికే చేయించుకోవచ్చు—

కాని, వెధవ పీడ. తెల్లవార్లూ ఒకటే గోల

కింద

పిగ్మీల్లో ఓ మరు పిగ్మీ అలా ఆకాశం వైపు చూసినట్టు కిటికీ వైపు చూసేప్పటికి దొర దేవుళ్ళా రూపు కట్టేడు.

ఆ క్లిష్ట పరిస్థితిని దొర మాత్రమే పరిష్కరించగలడనే పేరాశ కలిగింది ఆ సోషల్ పిగ్మీకి.

చేతులెత్తి దణ్ణం పెట్టేడు.

"దొరగారూ, కొట్టుకు సచ్చి పోతన్నారు. ఓ సెనం దిగిరండి బాబూ" అని ఓ వరం కోరేడు.

కోరించే తడవుగా, 'కోరిన వరమీని వేల్పు' మేడ దిగి గేటుతీసి బైటకొచ్చేడు.

అయ్యగారు గేటు ముందు ప్రత్యక్షం కాగానే ఆశ్రిత జనం అంతా ఆయన ముందు కొచ్చి నిలబడ్డారు.

"ఏవిటీ గందరగోళం?" ముఖం చిట్లించి అడిగేరు సాంబమూర్తిగారు.

"దాని ఒల్లు కావరం సూడండి దొరా నిచ్చేపంలాంటి మొగుడుండగా సెందురిడిగాడి గుడిసెలో దూరింది."

ఫస్టురేట్ ఇన్ఫర్మేషన్ కాని సమగ్రం కాదు.

"ఎవడు?" అడిగేరు ఆసక్తిగా.

అంతలో జనం మధ్యలోంచి బాణంలా

దూసుకొచ్చి ముందు నిలబడ్డాడు వీరన్న. అతడు చాల ఆందోళనగా కన్పిస్తున్నాడు.

"సూడండి దొరా అది యిన్నాళ్లనించి తమరి లోగిల్లో పన్జేత్తన్నది గందా, ఎప్పుడైనా యెకిలియేసాలు ఏసిందా సెప్పండి. సీతాలు అట్టాంటిదిగాదు. ఒక్కనాటికీగాదు. ఆదే ' ఆ గుడిసేటి ఆదే ఏమత్తు మందో జల్లి యెత్తుకుపోయాడు "

సీతాలు అచ్చం సీతమ్మ వారైనట్టూ, రాఁవణా బ్రహ్మ సెందురిడి అవతారం ఎత్తి ఆమెను ఎత్తుకుపోయి గుడిసెలో దాచుకున్నట్టూ వాపోయేడు వీరన్న.

వీరన్న మాంచి పోతరించి వున్నాడు. సీతాలుకు కావల్సింది వీరన్నలో వీసమెత్తయినా తక్కువగా కన్పించలేదు సాంబమూర్తిగారికి. ఇన్నేళ్ళనించి ఎప్పుడూ సీతాలు కళ్ళలో వాంఛ కన్పించలేదు. మనిషి కొంచెం నలుపే ఐనా మంచి ఒడ్డూ పొడుగూ అందమైన ఒంపులూ, మగవాణ్ని సూదంటు రాయిలా లాగ్గలిగే సొంపులూ చాలా వున్నాయి. సీతాలు తలంటుకుని, పదిపైసల బిళ్ళంత కుంకుమ బొట్టు పెట్టుకుని ఎండలో తలార్చుకుంటుంటే ఆ వయసులో ఆయనకే అప్పుడప్పుడూ మనస్సు చలిస్తో వుంటుంది.

దొరవారు అలా ఆలోచనల్తో తేలిపోతూ వుంటే, ఇవతల వీరన్నకి యీ సమస్య బొత్తిగా ఆయన తలకెక్కనట్టు అనుమానం పొడకట్టింది.

"తఁవరు కొంచెం యీతలికి రండి దొరా మీకే తెలుత్తది" అని ఆయన చెయి పుచ్చుకోబోయి, తన అర్హతను మర్చిపోయినందుకు చిన్న బుచ్చుకుని, ఒక టార్చిలైటు మాత్రమే లాక్కుని ముందుకు నడిచేడు. అతని వెంట వెళ్లేరు సాంబమూర్తిగారు.

చంద్రన్న గుడిసె వీరన్నకి నాలుగైదు గుడిసెల అవతలవుంది. అక్కడ ఆగి టార్చి తలుపులేని గుడిసె లోపలికి ఫోకస్ చేసి—



"సూడండి దొరా.. ఉప్పుడు సూడండి " అన్నాడు.

లోపల సీతాలు బొంతెన కాళ్ళమీదు కూర్చొని ముఖం మోకాళ్ళలో దాచుకుంది. చంద్రన్న చాపమీద పడుకుని తనకేం సంబంధం లేనట్టు పైకి చూస్తున్నాడు.

"సూడు దొరా ఆ లంజకొడుకు ఏమీ ఎరగనట్టు గుడిసెలో దూరి తొంగున్నాడు."

దొరగారి వెనకే మళ్ళీ అందరూ వచ్చేరు.

"దొరగా రొచ్చారు బైటికి రండిరా సెంద్రుడూ."

పిల్చేడో పెద్దమనిషి.

సాంబమూర్తిగారికి పరిస్థితి కూలంకషంగా అర్థమైపోయింది. ఆ వ్యవహారంతో తనకెట్టి సంబంధమూ లేదు. కలుగజేసుకోవల్సిన అవసరంకూడా కన్పించదు. కాని సీతాలు, తన యింట్లో పన్జేసేపిల్ల ఇంత ఇమ్మోరల్‌గా బిహేవ్ చేస్తే తన ప్రిస్టేజికి మాత్రం భంగంకాదా!

"బయటికి రావే సీతాలూ" అన్నాడు అధికారికంగా.

కొంతసేపు సీతాల్లో ఏమీ చలనంలేదు.

ఏమనుకుందో ఏమో కొంతసేపటికి లేచి గుడిసె గుమ్మందూరి బయటకొచ్చి తలొంచుకుని నిలబడింది.

"అర్ధరాత్రి వాడి గుడిసెలో నీకేం పనే."

సీతాలు వులకలేదు పలకలేదు.

"నిన్నే. ఎందుకెళ్ళావూ అనడుగుతున్నా" గద్దించేడు.

"అద్దరేతిరి ఆడది మొగోడి దగ్గిరి కెందుకెల్దో తెలవదేటి?" ఎదురుప్రశ్న వేసింది సీతాలు.

"ఏంటే ఆ రల పొగురూ! ఎవరిముందు నుంచున్నావో తెల్టం లేదేంటె?" కసురుకున్నాడో కూలీ.

సాంబమూర్తిగారికి తిక్కరేగింది.

"సరిగా చెబుతావా తన్నమంటావా?" అన్నాడు.

ఈ కేకలికి మిగిలిన యిళ్ళల్లో జనంకూడా లేచి బయటికొచ్చేరు. మామూలు కూలీల గొడవలు వాళ్ళకు మామూలే. అంతగా పట్టించుకోరు. కాని కొత్త కంఠం విన్నాక వాళ్ళకి వుత్కంఠ పెరిగినట్టుంది.

వాళ్ళని చూశాక సాంబమూర్తి గారికి పౌరుషం మరింత పెరిగి చేతికర్ర పైకెత్తి ముందుకెళ్ళేడు.

వీరన్న సాంబమూర్తిగారికి అడ్డం వెళ్ళి.

"కొట్టకండి బాబూ దానికేఁ తెలవదు" అని వేడుకున్నాడు.

జీసస్ అచ్చం ఇలానే అని వుంటాడు.

"చెప్పు " కర్ర నేలకికొట్టి గద్దించేడు సాంబమూర్తిగారు.

"సెప్పానుగదండి" అంది తలొంచుకునే.

"ఇలాంటి మొగుడుండగా వాడి దగ్గరికెందుకెళ్ళేవు?"

మాట్లాళ్ళేదు సీతాలు. ఒట్టి పిచ్చిప్రశ్న అనుకుంది.

"చెప్పాలి?"

ఈసారి మెల్లిగా ముఖంఎత్తి సాంబమూర్తిగార్ని చూసింది. కాస్సేపాగి

"అనూరాధమ్మగారికి పండంటి డాట్టరుబాబు నిచ్చి పెళ్ళిసేసారుగందా, మరాయిన్నొదిలేసి ఎందు కెళ్ళిపోయింది?"

కొంచెం వెనక్కి తగ్గేడు సాంబమూర్తిగారు. అయినా ఏదో చెప్పాలి.

"దానికి యిష్టం లేకపోయింది. యిష్టమున్న వాణ్ని పెళ్ళాడించి" అన్నాడు.


"మీకేనా ఇట్టా యిష్టాలు మాకు లేవేంటి? యీరన్నంటే నా కిట్టంలేదు. ఇట్టమున్నోడి దగ్గిరి కెళ్ళిపోయాను. మీ కూతురు సేసుకున్నదీ పెల్లే అయితే నాదీ పెల్లే" అంది తెగేసి.

సాంబమూర్తిగారికి నోట మాటరాలేదు.

——తనకున్న ధనమూ, పలుకుబడీ ఒక సామాన్య స్త్రీముందు ఎందుకూ పనికిరాకుండా పోయేయి——

పక్కనెవ్వరో నవ్వినట్టు అనిపించి మరింత కృంగిపోయేడు.

"పెద్దోళ్ళ గొడవలు నీకెందుకే సీతాలూ" అన్నాడో ముసలికూలీ. సాంబమూర్తిగారే తగ్గటం చూసేప్పటికి సీతాలంటే అతనికి భయం పుట్టుకొచ్చింది.




"యేఁ పెద్దోళ్ళు లేసిపోతే పేమా, పేదోళ్ళు లేసిపోతే రంకూనా" అని మళ్ళీ ఓ బాంబు పేల్చింది.

ఎవరికీ నోట మాటరాలేదు.

సాంబమూర్తిగార్ని ఎవరూ ఎప్పుడూ ఎదిరించి ఎరగరు. ఆయనింట్లో పనిచేస్తూ వుండి కూడా సీతాలు అంత నిర్భయంగా దులిపేసేప్పటికి, అంతా మూగివాళ్ళయిపోయేరు. సాంబమూర్తిగారి పరిస్థితికూడా అదే. ఏమన్నా, ఏం చేసినా పరువు నిలిచేట్టు లేదు.

"ఛీ, వెధవ అలగా జనం" అనుకుంటూనే వెళ్ళిపోయేరు.

వెళ్ళిపోయి మంచంమీద ఒరిగేరు.

జరిగిందంతా ఏదో పీడకలలా అనిపించింది. గతం పగబట్టిన తాచులా పడగవిప్పి బుసగొట్టింది.

—ఒకే ఒక్క కూతురు అనూరాధ. ఆమె కోసమేఁ తను అన్ని అవతారాలూ ఎత్తి సంపాదించేడు. డాక్టరు చదివించేడు. ఆస్తి బైటికి పోకుండా విదేశాల్లో డాక్టరై తిరిగొచ్చిన మేనల్లుడికిచ్చి పెళ్ళి చేసేడు. అతనికి అందం, అయిశ్వర్యం చదువూ—అన్నీ వున్నాయి. అన్నిటికంటె అతను అనూరాధని అమితంగా ప్రేమించేడు. ఆరాధించేడు. అయితేనేం ఆమెకు నచ్చలేదు. అతన్నెప్పుడూ కన్నెత్తి చూశ్శేదు. తాకితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది.

—పై చదువు పేరుతో ఇంగ్లండు వెళ్ళిపోయింది అనూ. అక్కడే ఎవర్నో పెళ్ళిచేసుకుంది. చాలాకాలం వరకు అది వ్రణంలా తన్ను బాధపెట్టింది. తర్వాత అంతా మర్చిపోయేడు. మర్చిపోడానికి మరింతగా పనిలో మగ్నమై రెట్టింపు సంపాయించేడు—

సీతాలు రెండ్రోజులు యింట్లో పనికి రాకపోయేప్పటికి మున్సిపాల్టీవాళ్ళు సమ్మె చేసినంతగా బాధపడిపోయేరు వాళ్లు. సీతాలు అంటే యింట్లో అందరికీ తగని యిష్టం. ఏ పనైనా చెప్పనక్కర్లేకుండా చక్కబెట్టుకు పోతుంది. ఆమె రాకపోయేప్పటికి ఎవరికీ కరచరణాలు ఆడలేదు. మరో పనిమనిషిని పెట్టుకోవాలంటే ఆ యింటావిడకి మనస్కరించనూలేదు. అంత జరిగేకకూడా ఆ యిల్లాలు సీతాలును ఒదులుకోలేకపోతోంది. మూడోరోజు పనికుర్రాడ్ని పిల్చి,

"సెందిరిగాడి గుడిసె దగ్గరకెళ్ళి సీతాల్ని పిల్చుకురారా" అని పంపించింది.

వాడు వెంటనే తిరిగొచ్చి,

"అక్కడెవల్లూ పలకడం లేదండమ్మా" అని చెప్పేడు.

ఆమే స్వయంగా పిల్చింది.

"ఇక్కడుండమ్మగారూ . ." అంటూ వీరన్న గుడిసెలోంచి బైటకొచ్చింది సీతాలు.

"పనికి రావటం లేదేమే" అనడిగింది.

"మొన్న అయ్యగార్ని ఏమేమో అన్నా నండమ్మగారూ! మొకం సెల్లటంలేదు" అంది.

"ఏడిశావ్‌లే రా " అని తీసికెళ్ళింది యజమానురాలు.

ఇదంతా గమనిస్తూనే వున్నాడు సాంబ మూర్తిగారు.

"మళ్ళీ మొగుడి దగ్గరి కెళ్ళిపోయావేంటే సీతాలూ" అనడిగింది ఇంటావిడ.

అవునని చెప్పింది సిగ్గుపడుతో.

"రొండు రోజుల్నుంచీ కూడూ-కూమ్మూ లేకండా గుడిసెలో తొంగుని ఏడుత్తుంటే తెలిసి యెల్లకుండ వుండలేకపోయానండమ్మ గారూ! నన్ను సూడగానే బావురుమన్నాడండి. నువు లేకపోతే బతకలేనే సీతాలూ అని యేడ్చి నాడండమ్మా నానూ ఆడదాన్నే. సెట్టంత మొగోడు నా కోసం యేడిసాడంటే ఆడికెంత పేముండాలి సెప్పండి"

"మరెందుకెళ్ళేవే?"

"యీరన్నకి నానంటే ఇంత మనసని యెరక్కపోయానమ్మా యెదవ పిచ్చమ్మా... యీడికాడ పిల్లలు పుట్టడం లేదనీ. " అని ఆగిపోయింది.

కాస్సేపుండి

"యెదవ పిల్లలెందుకు ౦ండమ్మగారూ మనసున్న మొగోడు...మళ్లీ దొరుకుతాడేంటి!" అంది.

కూతురూ, మేనల్లుడూ మనసులో మెదిలేరు సాంబమూర్తిగార్కి. కూతుర్ని బతిమాలుతోన్న అల్లుడి రూపం కళ్ళముందు కట్టి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

## అ ం కి త ం

నా కథపడ్డ ప్రతి పత్రికా కొని చదివి. ఎంతో శ్రద్ధగా తమ అభిప్రాయాలు వ్రాసే ఆప్తమిత్రులు శ్రీ వై. ఎస్. టి. సాయి గారికీ వారి కుటుంబ సభ్యులకీ—

—కె. కె. మీనన్ □

